సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
78932 44734
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

వైభవంగా కుంచమాంబ నెల పండగ



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న జియ్యాని శ్రీధర్

కంచరపాలెం: మర్రిపాలెం ప్రజల ఆరాధ్య దేవత, కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన కుంచమాంబ అమ్మవారి నెల జాతరను గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. గ్రామ కమిటీ సభ్యులు తొలిపూజ అనంతరం సాధారణ భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శర్మ ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ సమారాధనను జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. ముందుగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎయిర్‌పోర్ట్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

తీరంలో స్వచ్ఛభారత్



సేకరించిన చెత్తతో నెహ్రూ యువ కేంద్రం వలంటీర్లు, సిబ్బంది

బీచ్ రోడ్డు: యాంత్రిక జీవితం పేరిట నెహ్రూ యువ కేంద్రం నిర్వహించిన ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది. మంగళవారం సాగరతీరంలో ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను తెలియజేస్తూ ఈ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ బుచ్చిరాజు ప్రారంభించారు. అనంతరం బీచ్‌లో స్వచ్ఛ భారత్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి జి.మహేశ్వరరావు, అటవీ శాఖ రేంజ్ అధికారి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

25న సహస్ర తులసిపూజ : కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 25న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

కాలువలో పడి వ్యక్తి మృతి



మృతి చెందిన రవికుమార్

అల్లిపురం: మద్యం మత్తులో ఆర్టీసీ కాంప్లెక్స్ దరి కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం తెల్లవారు జామున చోటు చేసు కుంది. టూటౌన్ సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం విశాలాక్షినగర్‌కు చెందిన నడిగట్టు రవికుమార్(43) సెంట్రల్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసి రిటైర్ అయ్యాడు. తర్వాత మద్దిలపాలెంలో గల మహేంద్ర షోరూంలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతను తాగుడుకు అలవాటు పడ్డాడు. సోమవారం రాత్రి ఇంట్లో విజయనగరం వెళ్తున్నానని చెప్పి కాంప్లెక్స్ వచ్చాడు. మంగళవారం తెల్లవారి అతను కాలువలో పడి మృతి చెందిన విషయం గమనించిన ఆర్టీసీ సిబ్బంది పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుని తండ్రి అప్పలస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్ట్‌మార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ వెస్ట్
9398184202, 9912440606

అరకొర సిబ్బందితో అవస్థలు

- అధ్వానంగా జోన్-5లో పారిశుధ్య పనులు
- కార్మికులను పెంచాలని ప్రజల డిమాండ్

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 పరిధిలోని 24 వార్డుల్లో పారిశుధ్య సమస్య తీవ్రంగా వేధిస్తోంది. జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్, కంచరపాలెం, మర్రిపాలెం, తాటిచెట్లపాలెం, అక్కయ్యపాలెం, రైల్వేన్యూకాలనీ, ఎన్‌ఏడీ కొత్తరోడ్డు, మల్కాపురం, శ్రీహరిపురం, సింధియా ప్రాంతాల్లో జనసంచారంతో పాటు వ్యాపారాలు అధికం. ఈ ప్రాంతాల్లో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఎక్కువగా ఉంది. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వార్డుల విస్తీర్ణం పెరిగినా పారిశుధ్య కార్మికులు పెరగకపోవడంతో ఉన్న కార్మికులతోనే పనులు నెట్టుకొస్తున్నారు. వీరిని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు పర్యవేక్షిస్తుంటారు.

సిబ్బంది కొరతతో ఇబ్బందులు..

జోన్ పరిధిలో 24 వార్డులకు సంబంధించి 24 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు విధులు నిర్వహించాలి. కానీ ఐదుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, నలుగురు ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, 9 మంది ఔట్‌సోర్సింగ్ ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు పబ్లిక్‌హెల్త్ మేస్త్రీలు, ఒక పబ్లిక్‌హెల్త్ వర్కర్ వార్డులో విధులు నిర్వహిస్తున్నారు. వార్డులో కార్మికులు సరిపడక విశ్రాంత సిబ్బందితో ఆఫ్టింగ్ విధానంలో పనులు చేయిస్తున్నారు.



చెత్త తరలింపుపై సూచలిస్తున్న జెడ్సీ కృష్ణ



రోడ్లు శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

సిబ్బంది సెలవు పెడితే గల్లీలు దుర్గంధంగా మారుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- అవగాహన లేని మలేరియా, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా పనులు చేయిస్తుండడంతో కొన్ని వార్డుల్లో పనులు నత్తనడకన సాగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.
- జోన్ 5లో సరిపడినంత మంది పారిశుధ్య కార్మికులు లేక గెడ్డలు, కల్వర్టుల్లో చెత్తా చెదారాలు పేరుకుపోతున్నట్లు చెబుతున్నారు.
- తడి-పొడి చెత్త సేకరణ, గల్లీలో రోడ్లు, కాలువలు శుభ్రపరచడానికి ఉన్న సిబ్బందితోనే కాలం గడిపేస్తున్నారు.
- పరిస్థితులు ఇప్పుడే ఇలా ఉంటే వచ్చే వర్షాకాలంలో మరీ దారుణంగా ఉంటాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఎక్కువ మంది పారిశుధ్య కార్మికులను కేటాయించాలని అడగని వార్డు కార్పొరేటర్ల తీరుపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి, పర్యవేక్షించాలని అంటున్నారు.

జోన్ 5 పరిధిలో 24 వార్డులకు సంబంధించిన శాశ్వత, ఔట్‌సోర్సింగ్, నైట్ కార్మికులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది విధుల నిర్వహణ ఇలా..

వార్డు	శాశ్వత కార్మికులు	ఔట్ సోర్సింగ్	నైట్ కార్మికులు	సూపర్‌వైజర్లు	డిప్యుటేషన్
40వ వార్డు	00	09	09	00	01
41వ వార్డు	17	18	35	04	01
42వ వార్డు	15	31	46	03	01
43వ వార్డు	12	25	37	03	01
44వ వార్డు	06	45	51	04	00
45వ వార్డు	01	40	41	02	06
46వ వార్డు	05	23	28	00	00
47వ వార్డు	04	27	31	03	00
48వ వార్డు	06	34	40	03	02
49వ వార్డు	05	45	50	02	03
50వ వార్డు	00	33	33	03	01
51వ వార్డు	00	47	47	04	01
52వ వార్డు	06	35	41	04	00
53వ వార్డు	06	31	37	02	00
54వ వార్డు	07	34	41	04	02
55వ వార్డు	12	26	38	04	01
56వ వార్డు	08	35	43	04	01
57వ వార్డు	11	31	42	02	01
58వ వార్డు	11	31	42	03	05
59వ వార్డు	04	34	38	03	02
60వ వార్డు	05	39	44	04	00
61వ వార్డు	07	27	34	02	03
62వ వార్డు	03	28	31	01	01
63వ వార్డు	02	21	23	02	00

ఉన్నతాధికారుల దృష్టికి..



జోన్-5 పరిధి అధికం కావడంతో పారిశుధ్య కార్మికుల కొరత కొంత వరకు ఉంది. ఇప్పటికే వార్డుల వారీగా సిబ్బందిని సర్దుబాటు చేస్తూ పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. వార్డుల్లో సిబ్బందిని నియమించేందుకు జోన్ పబ్లిక్‌హెల్త్ ఏఎంహెచ్‌వోతో సమన్వయం చేసుకుని జాబితాను తయారు చేశాం. కొత్త సిబ్బందిని నియమించేందుకు జీవీఎంసీ కమిషనర్, మేయర్ దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లాం. త్వరలో కొత్త సిబ్బందిని నియమించేందుకు కృషి చేస్తాం.

– ఆర్‌జీవీ కృష్ణ, జోనల్ కమిషనర్, జోన్-5, జ్ఞానాపురం

కొబ్బరి బొండాల వ్యాపారుల నిర్లక్ష్యం!

- ముక్కలు చేయకుండా డంప్ చేస్తున్న వైనం
- దోమల పెరుగుదలకు ఊతం



బాజీ జంక్షన్‌లో ఖాళీ కొబ్బరి బొండాలను డంపర్ బిన్‌లో వేస్తున్న వ్యాపారి

గోపాలపట్నం: కొబ్బరి బొండాల వ్యాపారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు సాగించి దోమల ఉత్పత్తికి కారణమవుతున్నారు. ఎన్‌ఏడీ నుంచి గోపాలపట్నం వరకు పలువురు వ్యాపారులు ఇదే తీరున వ్యవహరిస్తున్నారు. అయినా జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రచారానికే పరిమితం

నీరు నిల్వలేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రచారం చేస్తారు. కానీ క్షేత్ర స్థాయిలో చర్యలు కానరావన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొబ్బరి బొండాల్లో నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయని వాటి వల్ల డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వస్తాయని ఊదర గొడకొడతారు. బొండాన్ని నాలుగు ముక్కలు చేయాలని సూచిస్తారు. అయితే వ్యాపారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఖాళీ బొండాలను ప్రత్యేక జీవీఎంసీ వాహనానికి ఇవ్వాలి. అయినా దగ్గరలో ఉన్న డంపర్‌బిన్లలో వేస్తారు. ఆయా వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పట్టించుకోరు. ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి తాగి పడేసిన కొబ్బరి బొండాలను నాలుగు పీలికలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యాధుల రహిత నగరమే లక్ష్యం



ఓవర్ హెడ్ ట్యాంక్‌ల్లో దోమ లార్వాలను పరిశీలిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సింధియా: విశాఖ నగరాన్ని వ్యాధుల రహిత నగరంగా తీర్చిదిద్దడానికి ప్రజలు సహకరించాలని మల్కాపురం మలేరియా నివారణ విభాగ ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్ కోరారు. వ్యాధుల నివారణకు శ్రమిస్తుంటే కొంత మంది వాటిని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ దోమలార్వాల ఉత్పత్తికి కారణమవుతున్నారన్నారు. జీవీఎంసీ 62వ వార్డు ప్రకాష్‌నగర్‌లో బయాలజిస్ట్ చక్రవర్తి ఆధ్వర్యంలో రవికుమార్ తమ సిబ్బందితో ఓవర్ హెడ్ ట్యాంకర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు సంభవిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మంచినీటి ట్యాంక్‌లను నిత్యం శుభ్ర పరుచుకోవాలని, ట్యాంక్‌లపై మూతలు ఉండేలా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. ప్రతి మంగళ, శుక్రవారం డ్రై డే పాటించాలని కోరారు. డెంగ్యూ కారక దోమలు మంచినీటిలోనే ఉత్పన్నమవుతాయని, ఈ దోమలు పగటి పూట మాత్రమే కుడతాయని తెలిపారు. 3 రోజులకు ఒకసారి మంచినీటి నిల్వలను మార్చుకోవాలని సూచించారు. చిన్నపిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని, ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వైద్యులను సంప్రదించాలని అన్నారు. కార్యక్రమంలో మలేరియా సూపర్‌వైజర్లు దుల్లా శ్రీనివాసరావు, విజయకుమారి, కృపామణి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విమాన్ నగర్‌లో పాము కలకలం



విమాన్‌నగర్‌లో నాగు పామును పట్టుకున్న కిరణ్

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు విమాన్‌నగర్‌లో నాగు పాము కలకలం రేపింది. ఎన్‌ఎస్టీఎల్‌లో ఏడీఎఫ్ గా విధులు నిర్వహిస్తున్న నూనెల వెంకటేశ్వరరావు స్థానికంగా నివాసముంటున్నాడు. శనివారం ఉదయం సమయంలో బాత్‌రూమ్‌లోని కప్‌బోర్డులోకి పాము వెళ్లింది. స్థానికులు పామును బయటకు రప్పించేందుకు యత్నించినా ఫలితం లేక పోయిఒది. దీంతో పాము బయటకు రాకుండా ఖాళీల్లో గుడ్డలు అడ్డంగా పెట్టారు. ఏం చేయాలో తెలియక రెండురోజులు బిక్కుబిక్కుమంటూ గడిపారు. తెలిసిన వారి సలహామేరకు స్నేక్ క్యాచర్ కిరణ్‌కు సమాచారమివ్వడంతో మంగళవారం ఉదయం పామును చాకచక్యంగా పట్టుకున్నాడు. దీంతో వెంకటేశ్వరరావు కుటుంబం, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ పాములు కనిపిస్తే 98491 40500నంబర్‌కు సమాచారమివ్వాలని కోరారు. వాటిని పట్టుకుని జన సంచారం లేని చోట విడిచి పెడతామని తెలిపారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన



పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో జరుగుతున్న పరీక్షలను రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మంగళవారం పరిశీలించారు. ఎంబీఏ రెండో సెమిస్టర్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో, పటిష్టంగా నిర్వహించడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, తదితరులు పాల్గొన్నారు.

లోన్ పేరిట టోకరా

అల్లిపురం: ఫైనాన్స్ కంపెనీలో పనిచేసే వ్యక్తి లోన్ ఇప్పిస్తానని చెప్పి కొంత మందిచే దరఖాస్తులు చేయించాడు. తర్వాత లోన్ రాలేదని చెప్పి లోన్ డబ్బును తన ఖాతాలో వేసుకుని మోసగించాడని బాధితులు మంగళవారం టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం డాబాగార్డెన్స్‌కు చెందిన సెల్ ఎలెక్ట్ షోరూంలో రశ్విత్ అనే ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్ తమను మోసగించాడని వి.నరేష్, పత్తి గోవిందరావు తెలిపారు. పత్తి గోవిందరావుకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో రూ.50 వేలు, ఐసీఐసీఐ బ్యాంకులో రూ.50 వేలు, ఐడీఎఫ్‌సీలో రూ.50 వేలు లోన్ ఇప్పిస్తానని చెప్పి లాగిన్ చేశాడు. తర్వాత మీకు సివిల్ స్కోర్‌లేదు లోన్ రాలేదని చెప్పాడు. కాని గత రెండు రోజులుగా బ్యాంకు నుంచి ఫోన్ చేసి లోన్ ఎమౌంట్ కట్టమని ఒత్తిడి చేస్తున్నారని పేర్కొన్నారు. సదరు షోరూంకు వెళ్లి అడగ్గా రశ్విత్ పరారయ్యాడని, అతనిపై చాలా కేసులున్నాయని చెప్పడంతో బాధితులు టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు.

సైన్స్ జర్నల్ చీఫ్ ఎడిటర్‌గా కృష్ణా కళాశాల అధ్యాపకుడు



రామారావుకు నియామక పత్రం అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కర్రి రామారావుకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ జువాలజీ స్టడీస్‌కు చీఫ్ ఎడిటర్‌గా ఆయన నియామకమయ్యారు. ఈ మేరకు సైన్స్ పత్రిక నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జయలు అధ్యాపకుడు కర్రి రామారావుకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రామారావు అనేక అంతర్జాతీయ ప్రచురణలు, పుస్తకాల రచనతో పాటు సైన్స్ పత్రికలకు సంపాదకుడిగా , పర్యవేక్షకుడిగా పని చేస్తున్నారన్నారు. రామారావు కళాశాల కీర్తి ప్రతిష్టలు మరింత ఇనుమడింపజేశారని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు స్టాఫ్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పి.సిహెచ్.విష్ణుమూర్తి, డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావు, డాక్టర్ సుధీర్, డాక్టర్ రాజశేఖర్, రాజారావు పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వ విధానాలు దుర్మార్గం'



రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మిక వర్గాన్ని అణచివేసే కేంద్ర ప్రభుత్వ విధానాలు దుర్మార్గమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 831వ రోజుకు చేరుకున్నాయి, ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకుడు మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు అమ్మాలనే ఆలోచన వచ్చిన మోదీ ప్రభుత్వానికి ప్రజలు గట్టి బుద్ధి చెబుతారన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, ఈ ప్రయత్నాలను కార్మిక వర్గం ఒక తాటిపైకి వచ్చి తిప్పికొట్టాలన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను బడా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలనుకోవడం అన్యాయమన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమంలో ప్రజలందర్నీ భాగస్వాములు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొణతాల సుధ



బాక్సింగ్ తరగతులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు



వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న జియ్యాని శ్రీధర్

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కా పురం ప్రకాష్‌నగర్ హైస్కూల్‌లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని మంగళవారం వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశారన్నారు. ఈ తరగతుల ద్వారా చిన్నారుల తమ నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుని, మెడల్స్, సర్టిఫికెట్స్‌తో పాటు స్పోర్ట్స్ కోటాలో మంచి ఉద్యోగం సాధించే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, స్కూల్ యాజమాన్యం, క్రీడాకారులు పాల్గొన్నారు.

40వ వార్డులో..

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు షిప్‌యార్డ్ జీవీ నిలయం క్రీడామైదానంలో, గాంధీగ్రామం జీవీఎంసీ స్కూల్‌లో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా చిన్నారులకు బాక్సింగ్, షటిల్, ఫుట్‌బాల్ శిక్షణ తరగతు లను మంగళవారం ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, పీటీ నీరజ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ప్రారంభించారు. పిల్లలు వారికి నచ్చిన క్రీడలను ఎన్నుకుని భవిష్యత్తులో తల్లిదండ్రులతో పాటు గ్రామానికి మంచి పేరుప్రతిష్టలు తీసుకురావాలన్నారు. అనంతరం చిన్నారులకు ఎగ్, బన్, అంటిపండ్లు, ఫ్రూటీ లు జీవీఎంసీ సహాయంతో అందజేశారు. కార్యక్రమంలో బాక్సింగ్ కోచ్ గుర్రాల రామారావు, సాహు , షిప్‌యార్డ్ వైఎస్సార్‌టీయూసీ ప్రధానకార్యదర్శి చంటిబాబు, సచివాలయ సెక్రటరీ రాజాబాబు, వార్డు అధ్యక్షులు వరపల మహేష్, సచివాలయ కన్వీనర్లు, మీసాల సత్యానారాయణ, దండి శ్యామ్, పెంట్ల బాలకృష్ణ, బాక్సర్ గణేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

శాంతినగర్‌లో..

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్ పార్క్‌లో జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వేసవి క్రీడల శిక్షణ కార్యక్రమాన్ని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల పిల్లల్లో క్రమశిక్షణ అలవడుతుందన్నారు. ఈ శిక్షణ వచ్చేనెల 5 వరకు ఉంటుందని వార్డు ప్రత్యేక అధికారి ఎస్ జనార్దనరావు తెలిపారు. శిక్షణలో ఎవరైనా పాల్గొన వచ్చని తెలిపారు. బాక్సింగ్ నేర్పిస్తున్నారని చెప్పారు.

బీజేపీ ఎంపీ, మంత్రిని అరెస్టు చేయాలి



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న మహిళా సంఘాల ప్రతినిధులు

సీతమ్మధార : దేశానికి పతకాలు, పేరు ప్రతిష్టలు తెచ్చిన భారత స్టార్ మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను, హరియాణ మంత్రి సందీప్‌సింగ్‌ను అరెస్ట్ చేసి, పదవుల నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఐద్వా, ఏపీ మహిళా సమాఖ్య, పీవోడబ్ల్యూ, సీఎంఎస్ విశాఖ జిల్లా మహిళా సంఘాల ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మంగళవారం కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. మహిళలకు రక్షణ కల్పించే విధానాలు చేపట్టాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శి రోహిణి, కార్యదర్శి ఇందిర, జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విమల, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి, లలిత, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె.నిర్మల తదితరులు పాల్గొన్నారు.

మోదీ నిరంకుశ పాలనకు మూల్యం తప్పదు



జీవీఎంసీగాంధీ విగ్రహం వద్ద దీక్షలో పాల్గొన్న క్యాబ్ యూనియన నాయకులు

సీతమ్మధార : ప్రధాని నరేంద్ర మోదీ నిరంకుశ పాలనకు మూల్యం చెల్లించక తప్పదని క్యాబ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.శ్రీరాములు హెచ్చరించారు. మంగళవారం అఖిలపక్ష కార్మిక ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న దీక్షలు 788వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వంపై ప్రజలకు రోజురోజుకు అసహనం పెరిగిపోతుందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాలు ఆపాలని లేని పక్షంలో ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామన్నారు. ప్రభుత్వ సంస్థలను అదానీ, అంబానీలకు అమ్మాలని చూస్తే ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయుడు, గోపీకృష్ణ, అప్పలరాజు, శివ, శ్రీనివాసులు, శ్రీను, ప్రసాద్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ వెస్ట్
9912222753, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com